క్లుప్తంగా

రక్తదానం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరుకు చెందిన ఎస్. శంకర్ ఓ పాజిటివ్ రక్తం అవసరం కాగా వారు 'మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్' అధ్యక్షుడు మోరే లక్ష్మణరావును సంప్రదించారు. వెంటనే స్పందించి సంస్థ సభ్యుడు వెంకట భార్గవ్ ద్వారా ఆదివారం రక్తదానం చేయించారు.

కేజీబీవీ పాఠశాల తనిఖీ

బి.కోడూరు : మండలంలోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలను ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఎంపీపీ కోడూరు చెన్నమ్మ, జెడ్పీటీసీ దావీదులతో కలిసి తనిఖీ చేసి జగనన్న గోరుముద్ద అమలుపై విద్యార్థినీలను అడిగి తెలుసుకోవడంతో పాటు వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం పాఠశాల గదులలోకి వెళ్ళి పాఠశాల సిబ్బంది బోధిస్తున్న తీరుపై, పలు ప్రశ్నలను విద్యార్థినీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు, వంటగదులను పరిశీలించడంతో పాటు మౌలిక వసతులపై ఆరా తీశారు. అలాగే పాఠశాలలో అందిస్తున్న జగనన్న గోరుముద్ద అమలులో నిర్లక్ష్యం వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, మాజీ కన్వీనర్ యోగానందరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

బద్వేలు అర్బన్ : ఎండల తీవ్రత ఎక్కువ అవుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వ్యాపారస్తులు చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, అర్బన్ సీఐ జీ.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని ఆర్‌అండ్‌బీ బంగ్లా సమీపంలో శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రహాసరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.వి.ఎన్.ప్రసాద్, అర్బన్ ఎస్ఐ కత్తి వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల పండుగ

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలు చర్చిలలో ఆదివారం మట్టల పండుగను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్‌పీజీ-1 చర్చిలో డీనరీ చైర్మన్ రెవరెండ్ అబ్రహ్మాం ప్రేమ్ చంద్ క్రీస్తు ప్రేమ తత్వాన్ని, ఆయన మానవాళికి చేసిన సేవలను వివరించారు. ఎస్‌పీజీ-1 చర్చి నుంచి పుట్టపర్తి సర్కిల్ వరకు ఈత మట్టలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రెవరెండ్ జీవన్‌బాబు, క్రైస్తవులు, విశ్వాసులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక శ్రీరాములపేటలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ పంపిణీ చేశారు. తాళ్లమాపురం గ్రామానికి చెందిన మాచిరెడ్డి శివరామిరెడ్డి తోపాటు ముగ్గురికి రూ.3.40 లక్షల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. పేద ప్రజల వైద్యానికి సీఎం పెద్దపీట వేస్తున్నారని చెప్పారు.

జగనన్న ప్రభుత్వంలో 'సంక్షేమ' జాతర



మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



పాల్గొన్న డ్వాక్రా మహిళలు

వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు వెల్లువలా వచ్చాయని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు మండల పరిధిలోని డ్వాక్రా సంఘాలకు సంబంధించి ఆదివారం వైఎస్సార్ ఆసరా మూడో విడత మెగా చెక్కును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన సభలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం ఇన్ని పథకాలను మంజూరు చేయలేదని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేసిందన్నారు. టీడీపీ నాయకుడు నారా లోకేష్ చేసే పాదయాత్ర తన తండ్రి సమస్య పరిష్కారం కోసమేనని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాదని ఎద్దేవా చేశారు. జగనన్న ప్రభుత్వంలో సమస్యలన్నీ పరిష్కరిస్తుంటే మళ్లీ సమస్యలు ఎక్కడి నుంచి వస్తాయన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో రూ.1000 మాత్రమే పింఛన్ ఇస్తుండగా సీఎం జగన్ రూ.2,750 చొప్పున ఇస్తున్నారని, వచ్చే ఏడాది నుంచి రూ.3వేలు చొప్పున ఇస్తారన్నారు. పింఛన్ వయసును 65 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు తగ్గించడంతోపాటు నేరుగా ఇంటికి వెళ్లి వలంటీర్లు పింఛన్ ఇస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారని, ఇది అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. ప్రొద్దుటూరు మండల పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు మూడో విడతగా రూ.10,56,91,280 మంజూరైందన్నారు. ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి మాట్లా, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్ నాయక్ మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కో–ఆర్డినేటర్ లావణ్య, ఏపీఎం వెంకటసుబ్బమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కృష్ణకుమారి, కార్యదర్శి కృష్ణవేణి, సీఓలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



హాల్ టికెట్ల నంబర్లు వేస్తున్న సిబ్బంది

ప్రొద్దుటూరు కల్చరల్ : పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ప్రొద్దుటూరు డివిజన్‌లో 17 మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన 13,307 మంది విద్యార్థులు 69 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష రాయనున్నారు. అలాగే మండలంలోని 64 పాఠశాలలకు చెందిన 3848 మంది విద్యార్థులు 19 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. పట్టణంలో ఎస్సీఎస్ మున్సిపల్ హైస్కూల్, ఖాదర్‌బాద్ జెడ్పీహెచ్, ప్రభుత్వ బాలికల పాఠశాల, వసంతపేట, రెండో వార్డు మున్సిపల్ హైస్కూల్, వైవీఎస్, అనిబిసెంట్, ఉర్దూ కొత్తకొట్టాల, మోడంపల్లె ఉర్దూహైస్కూల్, నడింపల్లె, కశెట్టి, రమణమహర్షి, నారాయణ, వైఎంఆర్ కాలనీలోని,బొల్లవరం ,ఎస్ఎస్ఆర్ నగర్‌లోని శ్రీచైతన్య, సెయింట్‌జోసఫ్ పాఠశాల, గోపీకృష్ణ, జెడ్పీహెచ్ఎస్ దొరసానిపల్లె, గౌతమ్ పాఠశాలల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అన్ని పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎంఈఓ సావిత్రమ్మ పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి సౌకర్యాల ఏర్పాట్లపై పరిశీలించారు. విద్యార్థులు ఉదయం 8.45 గంటలకు తమకు కేటాయించిన సెంటర్‌కు చేరుకుని గదులను చెక్ చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

రాజుపాళెం: మండల కేంద్రమైన రాజుపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏ సెంటర్‌లో 180 మంది, బీ సెంటర్‌లో 165 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్నట్లు మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి జరగబోవు పదో తరగతి పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన చెప్పారు. మండల వ్యాప్తంగా 345 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వివరించారు.

మాట తప్పని వ్యక్తి వైఎస్ జగన్



మహిళలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

బి.కోడూరు : మాట ఇచ్చాడంటే ఆ మాటను తప్పక నెరవేర్చే వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు తెలిపారు. ఆదివారం మండల కేంద్రమైన బి.కోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో వెలుగు ఏపీఎం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా మూడవ విడత వారోత్సవాల కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని తప్పక నెరవేర్చుతున్నారని, ఇచ్చి మాట తప్పే చంద్రబాబు మాదిరి కాదన్నారు. అనంతరం బి.కోడూరు మండలానికి వైఎస్సార్ ఆసరా మూడవ విడత కింద రూ.1,74,37,061ల నిధులను విడుదల చేసి వారి అకౌంట్లలో జమ చేశారన్నారు. మండలంలో సుమారు 300 సంఘాల్లోని సభ్యుల్లో ఆనందాన్ని నింపారని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వైఎస్సార్ ఆసరా మూడవ విడత మెగా చెక్కును వారు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి, జెడ్పీటీసీ దావీదు, ఎంపీపీ కోడూరు చెన్నమ్మ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు ఓ.ప్రభాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ కె.రమణారెడ్డి, మండల ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, మాధవరెడ్డి, సర్పంచ్ మునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దుగ్గిరెడ్డి, యోగానంద రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రాజశేఖర్, జయరామిరెడ్డి, వెలుగు సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

హంసవాహనంపై ఆదిచెన్నకేశవస్వామి



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధి చెన్నంపల్లె గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత ఆదిచెన్నకేశవ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజైన ఆదివారం స్వామి వారు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కాయ కర్పూరం సమర్పించి పూజలు నిర్వహించారు. అలాగే సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత ఆదిచెన్నకేశవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలల్లో భాగంగా సోమవారం స్వామి వారికి శేషవాహన సేవ నిర్వహించనున్నట్లు ట్రస్టు బోర్డు చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ వాకమళ్లరంగారెడ్డి, సభ్యులు వాకమళ్ల నారాయణరెడ్డి, దశరధరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి చెన్నకృష్ణారెడ్డి, ఆలయ అర్చకులు రమేష్‌శర్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రపంచ సాహితీ బ్రహ్మోత్సవాలకు గుడిపాడు వాసి

దువ్వూరు : మండల పరిధిలోని గుడిపాడు గ్రామానికి చెందిన టి.కృష్ణమూర్తి యాదవ్ ప్రపంచ సాహితీ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ చైర్మన్ కత్తి మండవ ప్రతాప్ ఆహ్వానం పంపారు. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఈనెల 9, 10వ తేదీల్లో 48 గంటల పాటు నిర్విరామంగా ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొననున్నట్లు కృష్ణమూర్తి యాదవ్ తెలిపారు.

ఘనంగా బోనాల పండుగ

ఖాజీపేట : తిప్పాయపల్లె గ్రామంలో ఆదివారం బోనాల పండుగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గ్రామ రక్షణ దేవగా గంగమ్మ తల్లి ప్రసిద్ధి. అమ్మవారికి గ్రామంలోని వారు అందరూ కలసి నైవెద్యం అందించారు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

దువ్వూరు : పదో తరగతి పరీక్షలను ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యాశాఖాధికారి శివజ్యోతి తెలిపారు. మండల వ్యాప్తంగా 487 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు ఆమె పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలైన పుల్లారెడ్డిపేట ఉన్నత పాఠశాల, కస్తూర్బా బాలికల ఉన్నత పాఠశాల, దువ్వూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించామన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



మట్టలు చేతపట్టుకుని ఊరేగింపు నిర్వహిస్తున్న మదర్‌థెరిసా చర్చి విశ్వాసులు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని పలు చర్చిలలో ఆదివారం మట్టల ఆదివారం పండుగను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మదర్‌థెరిసా చర్చి విశ్వాసులు స్థానిక గుప్తానగర్ నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా సురేంద్రనగర్ వరకు మట్టలు చేతపట్టి ఊరేగింపును నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన రెవ. ఫాదర్ సగినాల ప్రకాష్, విచారణ గురువులు రెవ. ఫాదర్ లక్కినేని ఆరోగ్యరాజులు మాట్లాడుతూ లోక రక్షకుడైన యేసుప్రభువు సర్వలోక పాప పరిహారానికై యెరుసలేంలో ప్రవేశించిన దినమును చారిత్రక గొప్ప దినముగా పరిగణిస్తూ పండుగను జరుపుకుంటారని వివరించారు. కార్యక్రమంలో సహాయక గురువులు ఓసూరిజోసెఫ్, ఉపదేశికులు పాల్గొన్నారు. అలాగే ఫాతిమామాత చర్చిలో మట్టల ఆదివారం సందర్భంగా ఫాతిమానగర్ పురవీధులలో విశ్వాసులు మట్టలు చేతపట్టుకుని ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చర్చి విచారణ గురువులు రెవ. ఫాదర్ గొడుగునూరు విజయరావు ఆధ్వర్యంలో దివ్యబలిపూజ నిర్వహించారు.

సీఎస్ఐ చర్చిలో.. స్థానిక సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి డీనరీ చైర్మన్ రెవ. బి.జె.సునీల్‌కుమార్ దేవుని వాక్యాలు వివరించారు. అనంతరం మట్టలు చేతపట్టుకుని గుడి ప్రదక్షిణ నిర్వహించారు. అలాగే పట్టణంలోని బెరాక ప్రార్థనామందిరం, హోసన్నా మందిరం, మార్తోమా చర్చి, కొత్తచెరువు పురాతన చర్చి, బాలాయపల్లె చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు.

రాజుపాళెం : మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు ఆదివారం ఘనంగా మట్టల పండుగ నిర్వహించుకున్నారు. ఆయా గ్రామాల్లోని పాస్టర్లు సీమారాణి, అనిల్, ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో సంఘ సభ్యులు, మహిళలు, పిల్లలు హోసన్న, హోసన్న అని పలుకుతూ కాలనీలోని వీధులలో తిరిగారు. ఈసందర్భంగా పాస్టర్ అమ్మ సీమారాణి మాట్లాడుతూ ప్రభువు అందరిని చల్లగ చూడాలని, అందరూ ఎప్పుడు సంతోషంగా ఉండాలని ప్రార్థన చేశారు. అనంతరం చర్చిలో అందరూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్కడకు వచ్చిన వారికి అన్నదానం ఏర్పాటు చేశారు.

మైదుకూరు : మైదుకూరులోని క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ఆదివారం మట్టల ఆరాధన ఘనంగా నిర్వహించారు. పట్టణంలో సీఎస్ఐ షాలోం టౌన్ చర్చిలో సంఘ గురువు శాంతి స్వరూప్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శాంతి నగర్ థామస్ సీఎస్ఐ చర్చిలో ఎ.జయరాజ్, కృష్ణాపురంలోని సీఎస్ఐ చర్చిలో టి.అర్నిష్‌రాజ్ ప్రార్థనలు చేశారు.

ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రొద్దుటూరు : ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ తెలిపారు. స్థానిక ఎన్జీఓ హోంలో ఆదివారం కల్లూరు పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న ఆశా వర్కర్లు తమ యూనియన్‌లో చేరిన సందర్భంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ భద్రత, క్యాజువల్ లీవులు, మెటర్నిటీ లీవులు లేకుండా 365 రోజులు ఆశా వర్కర్లు పనిచేస్తున్నారన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం కార్మికులకు రూ.26వేలు వేతనం ఇవ్వాలని తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు, నాయకులు సుధాకర్, హరి, యేసోబ్, లక్ష్మీనారాయణ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి భూమి పూజ



విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ, మండల పరిధిలో ఆదివారం రెండు విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి భూమి పూజ చేశారు. స్థానిక ముక్కొండ వద్ద నిర్మాణంలో ఉన్న జగనన్న ఇళ్ల కాలనీ వాసులకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు వీలుగా రూ.2 కోట్లు అంచనాతో కాలనీ వద్ద సబ్ స్టేషన్‌ను నిర్మించనున్నారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు బండి నాగేంద్రప్రసాద్, ఏవీ సుబ్బారెడ్డి, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు కిరణ్మయి, జ్వాలా నరసింహాశర్మ, కౌన్సిలర్లు వెంకటేష్, సుధాకర్, వెంకటసుబ్బన్న, రామదాసు, భరత్‌కుమార్‌రెడ్డి, విద్యుత్ ఈఈ జీవీ రామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాముడు, విద్యుత్ ఏడీఈ శ్రీనివాసరెడ్డి, కన్‌స్ట్రక్షన్ విభాగం డీఈఈ నాగరాజు, ఏడీఈ భరణి, ఏఈలు రామభద్రయ్య, రఘు తదితరులు పాల్గొన్నారు.

■ మండలంలోని తువ్వపల్లె కూడలి వద్ద రూ.2 కోట్లు అంచనాతో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంఎస్ఆర్, రామశివారెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, రవిరెడ్డి, చిన్న మధు, పిల్లి నాగయ్య, టీవై ఓబుళరెడ్డి, మల్లేశ్వరరెడ్డి, అమరనాథరెడ్డి, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారం

మున్సిపాలిటీ పరిధిలో గడ్డంవారిపల్లెలో నెలకొన్న తాగునీటి సమస్యను ఆదివారం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పరిష్కరించారు. గ్రామంలో జాతీయ రహదారికి ఎడమ వైపున పైపులైన్ రహదారి నిర్మాణంతో పనికి రాకుండా పోయింది. దీంతో ఆప్రాంత ప్రజలకు నీటి సమస్య ఏర్పడింది. శనివారం గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిసి సమస్యను పర్కిరించాలని కోరారు. ఆదివారం గడ్డంవారిపల్లెలో రహదారికి ఎడమవైపున, ఎమ్మెల్యే బోరు వేయించారు. ఉదయం డ్రిల్లింగ్ వాహనానికి ఎమ్మెల్యే పూజ చేసి బోరు బావి తవ్వకాన్ని ప్రారంభించారు. సమస్యను పరిష్కరించినందుకు గ్రామస్తులు ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

మణిశయనకు ఉగాది మహానంది పురస్కారం



ఉగాది మహానంది అవార్డు అందుకుంటున్న మణిశయన

ప్రొద్దుటూరు : స్థానిక స్నేహశ్రీ వలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు దేవరశెట్టి మణిశయనకు ఉగాది పురస్కారాన్ని అందించారు. ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం విజయవాడలోని మాచినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఏఎస్ఎస్ టీవీ ఆధ్వర్యంలో ఉగాది మహానంది పురస్కారాన్ని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు చేతుల మీదుగా మణిశయన అందుకున్నారు. మణిశయన గతంలో రోటరీ ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రెసిడెంట్‌గా, ఆర్యవైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలుగా రాష్ట్ర ఆర్యవైశ్య మహిళా విభాగం అడిషనల్ జనరల్ సెక్రటరీగా, అగస్త్యేశ్వరస్వామి ఆలయ కమిటీ దర్మకర్తగా, ప్రస్తుతం శివోహం కమిటీ వైస్ చైర్మన్‌గా పనిచేస్తున్నారు.

గ్రామీణ రోడ్డుకు మహర్దశ



తారురోడ్డు వేసిన తరువాత ఇలా..

ఖాజీపేట : మండలంలోని బి.కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని శ్రీనివాసాపురం గ్రామానికి సరైన రోడ్డు లేక గ్రామస్థులు అవస్థలు పడేవారు. సుమారు 20 సంవత్సరాల కింద మెటల్ రోడ్డు ఉండేది. ఆ రోడ్డు మరమ్మతులు నోచుకోలేదు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చొరవతో 1.800 కిలో మీటర్లు సుమారు రూ. 65 లక్షలతో తారురోడ్డు తొలిసారిగా వేశారు. దీంతో 20 సంవత్సరాల నుంచి గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులు తొలగిపోయాయి.

ఉత్సాహంగా హాకీ టోర్నమెంట్



సీనియర్ క్రీడాకారుడు లక్ష్మీనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హాకీ క్రీడాకారులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో మాజీ హాకీ క్రీడాకారుడు దివంగత లక్ష్మీనారాయణ మెమోరియల్ హాకీ టోర్నమెంట్ ఆదివారం ఉత్సాహంగా సాగింది. ఈ టోర్నమెంట్‌ను ధ్యాన్‌చంద్ హాకీ అకాడమీ డైరెక్టర్ ఎస్.సుభాన్‌బాషా ప్రారంభించారు. తొలుత లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి హాకీ క్రీడకు ఆయన చేసి సేవలను ప్రస్తుతించారు. సీనియర్ క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని హాకీలో రాణించాలని సూచించారు. అనంతరం హాకీ పోటీలు నిర్వహించి విజేతలకు మెడల్స్ అందజేశారు.

సచివాలయాల్లోనే ఆధార్ సేవలు

- ప్రజలకు తప్పిన వ్యయ ప్రయాసలు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



గాదెగూడూరులోని ఆధార్ కేంద్రం

రాజుపాళెం : ప్రజలకు గ్రామ సచివాలయాల ద్వారా అన్ని రకాల సేవలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. అందులో భాగంగానే సచివాలయాలలో ఇప్పటికే 540 రకాల పైబడి పౌర సేవలు అందిస్తున్నారు. ఆ క్రమంలోనే ఆధార్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో ప్రజలకు ఆధార్ నమోదు, అప్‌డేట్ కోసం, సెల్ నంబరు లింక్ తదితర వాటికోసం మండల కేంద్రం, ఇతర మండలాలకు, జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రయాస తప్పింది.

గాదెగూడూరు సచివాలయంలో శాశ్వత ఆధార్ కేంద్రం ఏర్పాటు

మండలంలోని ఇదివరకు ఒకేఒక ఆధార్ కేంద్రం ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ నమోదు, అప్‌డేట్, బయోమెట్రిక్, ఫోన్‌నంబరు లింకు, పేర్లు మార్పు, తప్పుల సవరణ కోసం గ్రామాల నుంచి ఎన్నో వ్యవయ ప్రయాసలు పడి మండల కేంద్రానికి, ప్రొద్దుటూరు, దువ్వూరు, చాగలమర్రి, మైదుకూరు తదితర మండలాలకు వెళ్లాల్సి వస్తోంది. ఆ వ్యయ ప్రయాసలను తప్పించేందుకు ప్రభుత్వం ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లోనే సరైన రుజువులు చూపించి, నిర్ణీత రుసుము చెల్లించి ఆయా సేవలు పొందేలా చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగానే మండలంలోని గాదెగూడూరు గ్రామంలోని సచివాలయంలో శాశ్వత ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశారు. డిజిటల్ అసిస్టెంట్ ప్రత్యూషకు శిక్షణ ఇచ్చిన అనంతరం ఈ సచివాలయంలో ఆధార్ సేవలను ప్రారంభించారు. దీంతో ఆయా గ్రామస్తులకు ఎంతో సౌలభ్యంతో పాటు ప్రయాసలు, చార్జీల భారం తగ్గింది.

గ్రామ సచివాలయంలో ఆధార్ క్యాంపులు

ప్రభుత్వం, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో ఎంపీడీఓ సయ్యదున్నీసా ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రెండు నుంచి మూడు రోజుల పాటు క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. తాము ఉన్న మండలంలోనే సమస్యలు పరిష్కారం కావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షనీయం



గ్రామ సచివాలయంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయడం రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన హర్షణీయం. గతంలో ఆధార్ సేవలకు ఇతర మండలాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇకపై ఆధార్‌కు సంబంధించిన అన్ని పనులు మా గ్రామ సచివాలయంలో జరగడం సంతోషంగా ఉంది.

\- పోలా వరలక్ష్మి, సర్పంచ్, గాదెగూడూరు

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజుపాళెం మండలంలోని గాదెగూడూరు గ్రామ సచివాలయంలో ఆధార్ సేవలు ఏర్పాటు చేశాం. దీంతో ఆయా గ్రామస్తులకు ఆధార్ సమస్యల కష్టాలు తొలిగాయి. ఆధార్ సమస్యలున్న వారంతా సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

\- సయ్యదున్నీసా, ఎంపీడీఓ, రాజుపాళెం మండలం